సాక్షి
అనంతపురం
శుక్రవారం । 2 । ఆగస్టు । 2024



**టన్ను చీనీ రూ.18 వేలు**

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు పలికాయి.



**కిలో టమాట రూ. 26**

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.26, కనిష్టంగా రూ.13 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
35.2°/ 23.7°

జిల్లా అంతటా గురువారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచిం

## న్యూస్‌రీల్

### రైతుబజార్‌లో కందిపప్పు, బియ్యం విక్రయాలు



**అనంతపురం అర్బన్:** వినియోగదారులకు నిత్యావసర వస్తువులు సరసమైన ధరలకు అందించాలనే ఉద్దేశంతో రైతు బజార్‌లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా కందిపప్పు, బియ్యం విక్రయాలు చేపడుతున్నట్లు ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ జి.రామకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కందిపప్పు హోల్‌సేల్ డీలర్లు, రైస్ మిల్లర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్దేశించిన ధరలకు కందిపప్పు, బియ్యం విక్రయించాలని సూచించారు. కందిపప్పు (దేశవాళీ రకం) కిలో రూ.150, సోనామసూరి ఫైన్ రైస్ (స్టీమ్డ్) కిలో రూ.48, సోనామసూరి ఫైన్ రైస్ (ముడి) కిలో రూ.47తో అందించాలన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ప్రత్యేక కౌంటర్లు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో పౌర సరఫరాల శాఖ అధికారి శోభరాణి, తదితరులు పాల్గొన్నారు.

### కళ తగ్గని టీబీ డ్యాం



తుంగభద్ర జలాశయం గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్న దృశ్యం

**బొమ్మనహాళ్:** తుంగభద్ర జలాశయానికి వరద చేరిక కొనసాగుతోంది. బుధవారం 1,05,973 క్యూసెక్కులున్న ఇన్‌ఫ్లో గురువారం సాయంత్రానికి 1,98,109 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో డ్యాం 33 గేట్లను ఎత్తి 1,65,915 క్యూసెక్కుల నీటిని నదికి విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 97.870 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1,633 అడుగుల నీటి మట్టానికి గాను 1,631 అడుగులకు నీరు చేరింది. ఇదిలా ఉంటే హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105వ కిలోమీటర్ వద్ద 1,145 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

### ఎంజేపీలో నాన్‌టీచింగ్ ఉద్యోగుల తొలగింపు



ఉద్యోగాల నుంచి తొలగించడంతో పాఠశాల బయట వేచి ఉన్న సిబ్బంది

**రొద్దం:** మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందిని గురువారం తొలగించారు. రికార్డు అసిస్టెంట్ సతీష్‌కుమార్, డేటా ఎంట్రీ ఆపరేటర్ మధుసూదన్‌రెడ్డి, నైట్ వాచ్‌మెన్ మహబూబ్‌బాషా, డే వాచ్‌మెన్ నరసింహమూర్తిని విధుల నుంచి తొలగిస్తూ విజయవాడలోని ఎంజేపీ స్కూల్స్ సెక్రటరీ నుంచి మెయిల్ వచ్చినట్లు బాధితులు తెలిపారు. అయితే తమపై ఎలాంటి ఆరోపణలు లేకున్నా టీడీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి తెచ్చి తమను అన్యాయంగా తొలగించారని వాపోయారు. అలాగే కొందరు టీడీపీ నాయకులు తమ పార్టీ అధికారంలో ఉందనీ, తాము చెప్పినట్లు వినాలని పాఠశాలకు వచ్చి ఇక్కడి నుంచి వెళ్లి పోవాలని తమను నానాబూతులు తిట్టినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఎందుకు తొలగించారని ప్రిన్సిపాల్‌ను అడిగితే సెక్రటరీని అడగాలని సమాధానం చెప్పినట్లు పేర్కొన్నారు. తమను ఏ కారణం లేకుండా తొలగించడంపై అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### రేపటి నుంచి రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు

**తాడిపత్రి అర్బన్:** న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3, 4 తేదీల్లో రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అసోసియేషన్ కార్యదర్శి సాయి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. తాడిపత్రిలోని బాలాజీ ఫంక్షన్ హాలులో నిర్వహించే ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాలకు చెందిన 500 మంది క్రీడాకారులు పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## సంస్కరణలు తెచ్చి..
# వెలుగులు పంచి!



**బోరులో నీరున్నా పంట పెట్టాలంటే భయమేసేది. పొలాలను బీళ్లుగా వదిలేయాల్సి వచ్చేది. విద్యుత్ సరఫరా ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియక ఈ దుస్థితి ఉండేది. అధికారులను అడిగినా స్పందనే ఉండేది కాదు. ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేస్తే సరైన సమాధానమే దొరికేది కాదు. దశాబ్దాలుగా సమస్యలు నెలకొన్నా ఏ ప్రభుత్వమూ స్పందించింది లేదు. ఇక పరిస్థితి ఇంతే అనుకుంటున్న తరుణంలో వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆ కష్టాలన్నింటినీ తీర్చేసింది.**

- ఉమ్మడి అనంతపురం జిల్లా చరిత్రలో 2019–24లోనే విద్యుత్ సంస్కరణలు
- ఐదేళ్లలో 94 వేలకు పైగా విద్యుత్ సర్వీసుల మంజూరు
- గడిచిన రెండేళ్లలో రూ.70 కోట్లతో 9,612 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి సబ్‌స్టేషన్ల నిర్మాణం
- గతంలో ఎన్నడూ లేని విధంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు



శెట్టూరు మండలం ములకలేడు వద్ద నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్

**సాక్షి ప్రతినిధి, అనంతపురం:** కరువు ప్రాంతం... వర్షం అంతంతే.. బోర్ల కిందే వ్యవసాయం. కరెంటు ఉంటే గానీ పైరు పండని పరిస్థితి. ఇలాంటి ఉమ్మడి అనంతపురం జిల్లాలో నాలుగు దశాబ్దాల్లో ఎన్నడూ లేని విధంగా గడిచిన ఐదేళ్లలోనే సంస్కరణలు అమలయ్యాయి. కరెంటు ఎప్పుడొస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నుంచి 9 గంటలపాటు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ అందించే దశకు తీసుకొచ్చారు. దీంతో పాటు అత్యాధునిక ఫీడర్లు, కొత్త ఉపకరణాలను ఏర్పాటు చేసి రైతులు, గృహ వినియోగదారులకు ఊరట కల్పించారు.

**లో ఓల్టేజీకి చెక్..**

2019కు ముందు ఉమ్మడి జిల్లాలో రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరయ్యేందుకు రెండేళ్లు పట్టేది. కానీ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఆ దుస్థితి పూర్తిగా దూరమైంది. రైతులు దరఖాస్తు చేసుకున్న రెండు లేదా మూడు నెలల్లోనే ట్రాన్స్‌ఫార్మర్ వచ్చేలా చేశారు. లోవోల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఉపశమనం కలిగించారు. ఉమ్మడి జిల్లాలోనే 9 వేలకు పైగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి రికార్డు సృష్టించారు. రాష్ట్రంలోనే అత్యధికంగా ఎక్కువ వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చి మరో రికార్డు లిఖించారు. 33 కేవీ విద్యుత్ లైన్లు, కొత్త ఫీడర్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఇలా ఒకటేమిటి రూ.వందల కోట్ల వ్యయంతో మౌలిక వసతులు కల్పించారు. ఉచితంగా 9 గంటల నిరంతర విద్యుత్ ఇవ్వడంతో పాటు లోవోల్టేజీతో మోటార్లు కాలిపోయే పరిస్థితికి పూర్తిగా చెక్‌పెట్టారు. కనీవినీ ఎరుగని రీతిలో కొత్త సబ్‌స్టేషన్లు నిర్మించి విద్యుత్ రంగంలో కొత్త శకాన్ని ఆవిష్కరించారు. పూర్తిగా బోరుబావుల మీదే ఆధారపడ్డ ఉమ్మడి జిల్లా రైతన్నల కోసం గడిచిన ఐదేళ్లలో అమలు చేసిన విధానాలు ఎంతో ఊరట కలిగించాయి.

**అంటకాగారంటూ విష ప్రచారం..**

రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా ఉమ్మడి జిల్లాలో అద్భుతంగా విద్యుత్ సంస్కరణలు చేపడితే.. నేడు కూటమి ప్రభుత్వం, వారి అనుకూల మీడియా కలిసి అధికారులు గత ప్రభుత్వానికి అంటకాగారంటూ దుష్ప్రచారం చేస్తున్నాయి. ఈ విషయం తమనెంతో మనోవేదనకు గురి చేస్తోందని అధికారులు వాపోతున్నారు. వివిధ ప్రాంతాల్లో ఏఈలు మొదలుకొని ఉన్నతాధికారుల వరకూ రేయింబవళ్లు కష్టపడి పనిచేసి అత్యాధునిక మౌలిక వసతులు కల్పించామని, ఆ ఫలాలు ఇప్పుడు రైతులు అనుభవిస్తున్నారన్నారు. కానీ, ఎల్లో మీడియా అధికారులను పార్టీలకు అంటగట్టడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**విద్యుత్ రంగంలో గత ఐదేళ్లలో చోటుచేసుకున్న మార్పులు ఇలా..**

| కేటగిరీ | సంఖ్య | వ్యయం (రూ.కోట్లలో) |
|---|---|---|
| వ్యవసాయ కనెక్షన్లు | 94,060 | -- |
| ట్రాన్స్‌ఫార్మర్లు | 9,612 | 270.82 |
| సబ్‌స్టేషన్లు | 46 | 161 |
| పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు | 114 | 53.76 |
| 33కేవీ ఫీడర్లు | 11 | 40.26 |
| 11కేవీ ఫీడర్లు | 19 | 13.93 |
| హౌసింగ్ కాలనీలు | 349 | 88.32 |
| 11 కేవీ ఫీడర్లు | 593 | 1334.23 |
| కొత్త సబ్‌స్టేషన్ల ప్రతిపాదన | 273 | 955.5 |

**విద్యుత్ లైన్ వివరాలు**

| | | |
|---|---|---|
| 33 కేవీ కొత్త ఫీడర్లు | 579.5 కిమీ | రూ.50.6 కోట్లు |
| 33 కేవీ లైను | 42.4 కి.మీ | రూ.98.83 కోట్లు |

### ప్రత్యామ్నాయంపై దృష్టి

సాక్షి ఎఫెక్ట్..

**అనంతపురం అగ్రికల్చర్:** ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించినట్లు వ్యవసాయశాఖ జేడీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. 'కనిపించని ప్రత్యామ్నాయం' శీర్షికతో గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి వ్యవసాయశాఖ స్పందించింది. ఈ సందర్భంగా జేడీ కార్యాలయ వర్గాలు మాట్లాడుతూ వర్షాభావం కారణంగా ఈ ఏడాది ఖరీఫ్ సాగు తగ్గిందన్నారు. 3.46 లక్షల హెక్టార్లకు గానూ ప్రధాన పంటల సాగుకు గడువు ముగిసేనాటికి 1.22 లక్షల హెక్టార్లలో సాగులోకి రావచ్చని అంచనా వేశామన్నారు. ఇంకా 2.32 లక్షల హెక్టార్లు మిగిలి ఉంటుందన్నారు. ఇందులో 1.31 లక్షల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించడానికి ప్రణాళిక తయారు చేశామని తెలిపారు. ఇప్పటికే 27,820 క్వింటాళ్లు ప్రత్యామ్నాయ విత్తనాలు కావాలని ప్రతిపాదించామన్నారు. ప్రధానంగా ఉలవ 21,800 క్వింటాళ్లు, అలసంద 3,250 క్వింటాళ్లు, పెసలు 1,290 క్వింటాళ్లు, జొన్నలు 1,090 క్వింటాళ్లు, కొర్రలు 370 క్వింటాళ్లు, మినుము 20 క్వింటాళ్లు అవసరమని ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. ఆగస్టు 15 తర్వాత ప్రత్యామ్నాయ పంటల సాగుకు అనుకూలంగా ఉన్నందున అంతలోపు మరోసారి అన్ని మండలాల నుంచి పూర్తి స్థాయి సాగు విస్తీర్ణం, విత్తన మోతాదును పరిగణనలోకి తీసుకుని తుది ప్రణాళిక అమలుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### బీఫార్మసీ ఫలితాల విడుదల

**అనంతపురం:** జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో నిర్వహించిన బీఫార్మసీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. జూన్, జూలైలో నిర్వహించిన బీఫార్మసీ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–19) రెగ్యులర్ సప్లిమెంటరీ, బీఫార్మసీ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–15) సప్లిమెంటరీ, బీఫార్మసీ మూడో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–19), (ఆర్–15) సప్లిమెంటరీ ఫలితాలు, బీఫార్మసీ నాలుగో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–19), (ఆర్–15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి. చంద్రమోహన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫలితాల కోసం జేఎన్‌టీయూ వెబ్‌సైట్ చూడాలని కోరారు.

# బాబు నోట.. మళ్లీ పాత పాట!

**మడకశిర:** ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం మడకశిర నియోజకవర్గ పర్యటన ప్రజలను నిరాశకు గురిచేసింది. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సీఎం చంద్రబాబు మడకశిర మండలంలోని కే గుండుమల గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలోని కరియమ్మదేవి ఆలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అయితే మడకశిర నియోజకవర్గ అభివృద్ధికి 2014లో సాధారణ ఎన్నికల సందర్భంగా ఏ హామీలైతే ఇచ్చారో మళ్లీ అవే హామీలిచ్చి నియోజకవర్గ ప్రజలను మరోసారి మభ్య పెట్టారు. చంద్రబాబు తప్పుడు హామీలతో నియోజకవర్గ ప్రజలు విస్మయానికి గురయ్యారు. ముఖ్యంగా 2014లో హంద్రీనీవా కాలువను పూర్తి చేసి నియోజకవర్గంలోని అన్ని చెరువులకు కృష్ణా జలాలు అందిస్తానన్నారు. తన ఐదేళ్ల పాలనలో ఆ హామీని మాత్రం నెరవేర్చలేదు. అలాగే మడకశిర పారిశ్రామికవాడలో పరిశ్రమలు నెలకొల్పుతామన్నా, పట్టించుకోలేదు. కనీసం భూములిచ్చిన రైతులకు నష్ట పరిహారం



సభలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

కూడా చెల్లించలేదు. గుడిబండ మండలంలోని రాళ్లపల్లి వద్ద హంద్రీనీవా రిజర్వాయర్ ఏర్పాటు చేస్తామని చేయలేదు. అలాగే మడకశిరకు రింగ్‌రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసినా పనులను మాత్రం ప్రారంభించలేదు. 2014లోనే వక్క రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. 2014 నుంచి 2019 వరకూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఇందులో ఏ ఒక్క హామీని ఆయన నెరవేర్చలేదు. మళ్లీ అవే హామీలను చంద్రబాబు గురువారం గుండుమలలో జరిగిన ప్రజావేదిక కార్యక్రమంలో గుప్పించారు.

**టీడీపీ కార్యకర్తల అసంతృప్తి**

నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు జరిపిన పర్యటనపై పలువురు టీడీపీ కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ పర్యటనలో టీడీపీకి చెందిన ముఖ్య నాయకులు చంద్రబాబును కలవడానికి అవకాశం దొరకలేదు. కేవలం ఆయన గుండుమల ప్రజలతో మాట్లాడి వెళ్లిపోయారు. కనీసం నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలవడానికి కూడా చంద్రబాబు అవకాశం ఇవ్వకపోవడం చాలా అన్యాయమని తమ్ముళ్లు వాపోతున్నారు. ఎన్నికల సమయంలోనే చంద్రబాబుకు కార్యకర్తలు గుర్తుకువస్తారని, అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మాజీ ఎమ్మెల్యే ఈరన్న వర్గానికి చెందిన ముఖ్య నాయకులకు కూడా చంద్రబాబు పర్యటనలో పాల్గొనడానికి పాసులు దొరక్కపోవడంతో ఆ వర్గం నాయకుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

# సీఐల బదిలీ

**అనంతపురం:** అనంతపురం రేంజ్ డీఐజీ పరిధిలో పలువురు సీఐలు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా నుంచి కొందరు సీఐలకు స్థానచలనం కలిగింది. పలు స్టేషన్లకు కొత్త సీఐలు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం డీఐజీ డాక్టర్ షిమోషి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు. ఆయా పోలీసుస్టేషన్లలో వెంటనే రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించారు. బదిలీ సీఐలను వెంటనే రిలీవ్ చేయాలని ఎస్పీలకు సూచించారు.

**బదిలీ అయిన సీఐల వివరాలిలా..**

| పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ స్థానం |
|---|---|---|
| కే. రాఘవన్ | ఏపీఎస్‌డీఆర్ఐ, విజయవాడ | స్పెషల్ బ్రాంచ్, అనంతపురం |
| పి. జాకీర్ హుస్సేన్ | డీఎస్‌బీ అనంతపురం | వీఆర్, ఎస్పీ (డీజీపీ ఆఫీస్ అటాచ్) |
| ఎం. శ్రీకాంత్ యాదవ్ | ప్రొద్దుటూర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ | టూటౌన్, అనంతపురం |
| బి. క్రాంతి కుమార్ | టూటౌన్, అనంతపురం | వీఆర్, ఎస్పీ అనంతపురం |
| ఎం. సుబ్రహ్మణ్యం | డీసీఆర్‌బీ,అనంతపురం | డీసీఆర్‌బీ,తిరుపతి |
| కే.రాజగోపాల్ నాయుడు | పీటీసీ, తిరుపతి | హిందూపురం వన్ టౌన్ పీఎస్ |
| వి. శ్రీనివాస్ | హిందూపురం వన్ టౌన్ | వీఆర్ (ఎస్పీ, పుట్టపర్తి) |
| సి. ఆంజనేయులు | సీఐడీ ఆర్‌ఓ, తిరుపతి | హిందూపురం రూరల్ (యూపీఎస్) |
| వై. శ్రీనివాసులు | హిందూపురం రూరల్ | వీఆర్ (ఎస్పీ, పుట్టపర్తి) |

# పింఛన్ పంపిణీలో చేతివాటం

**అనంతపురం క్రైం:** ఉమ్మడి అనంతపురం జిల్లాలో గురువారం సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ ప్రక్రియలో టీడీపీ నాయకులు ఆర్భాటం చేశారు. ఈ క్రమంలోనే చేతివాటం ప్రదర్శించారు. శ్రీ సత్యసాయి జిల్లాలో ధర్మవరం మండలంలోని గొట్లూరులో అనిల్ అనే వ్యక్తి ఒక్కో పింఛన్ లబ్ధిదారుడి నుంచి రూ.1,000 మేర వసూలు చేసినట్లు తెలిసింది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరలైంది. పింఛన్ల పంపిణీలో నాయకులకు అధిక ప్రాధాన్యత ఇస్తే ఇలానే జరుగుతుందని పలువురు విమర్శలు గుప్పించారు.

**ఇప్పుడు తీసుకోకుంటే.. ఇక లేనట్లే!**

పింఛన్ల పంపిణీలో నూతన నిబంధనలు తీసుకొచ్చిన ప్రభుత్వం వాటి గురించి లబ్ధిదారులకు తెలియజేయలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులు ఒక నెలలో పింఛన్ తీసుకోకుంటే.. వచ్చే నెలలో రెండూ ఒకేసారి కలిపి పంపిణీ చేశారు. తాజాగా టీడీపీ ప్రభుత్వం ఆ నిబంధనను పక్కన పెట్టేసింది. ఈ విషయాన్ని పింఛన్‌దారులకు తెలియజేయలేదు.సాధారణంగా వృద్ధులు అనారోగ్యానికి గురై ఆస్పత్రుల్లో చేరుతుంటారు. అలాంటి వారు ఒక నెల పింఛన్ అందుకోలేరు. వృద్ధుల పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ఉదారంగా వ్యవహరించాల్సిన ప్రభుత్వం.. ఏకంగా శఠగోపం పెట్టేలా వ్యవహరిస్తుండడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**97 శాతం పింఛన్ల పంపిణీ..**

జిల్లాలో గురువారం 97 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు డీఆర్‌డీఏ కార్యాలయ అధికార వర్గాలు వెల్లడించాయి. 2,85,219 మంది ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ లబ్ధిదారులుండగా రూ. 125,05,81,500 ప్రభుత్వం విడుదల చేసింది. సచివాలయాల సిబ్బంది ద్వారా మొదటి రోజే 2,77,204 మందికి రూ.121,50,28,500 అందించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

### పర్యవేక్షించిన కలెక్టర్

**అనంతపురం అర్బన్:** జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద గురువారం చేపట్టిన పింఛన్ల పంపిణీ ప్రక్రియను కలెక్టర్ వి.వినోద్ కుమార్ కలెక్టరేట్ నుంచి పర్యవేక్షించారు. ఎస్ఐసీ హాలులో డీఆర్‌డీఏ పీడీ ఓబుళమ్మతో కలిసి ఆ శాఖ సిబ్బందితో కలెక్టర్ సమావేశం నిర్వహించి తగిన సూచనలిచ్చారు. పింఛను పంపిణీ విధులకు హాజరుకాని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# హంద్రీనీవాకు నీటి విడుదల

- రెండు పంపుల ద్వారా 1,000 క్యూసెక్కులు ఎత్తిపోత
- 6 రోజుల్లో జీడిపల్లి రిజర్వాయర్ చేరుకోనున్న కృష్ణాజలాలు



నంద్యాల జిల్లా మల్యాల వద్ద హంద్రీనీవాకు నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

**అనంతపురం సెంట్రల్:** శ్రీశైలం జలాశయం నుంచి హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు ఎట్టకేలకు నీరు విడుదలయ్యాయి. గురువారం నంద్యాల జిల్లా నందికొట్కూరు మండల పరిధిలో మల్యాల వద్ద హంద్రీనీవా అధికారులు, ఆ జిల్లా ప్రజాప్రతినిధులు రెండు పంపుల ద్వారా 1,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మరో నాలుగు రోజులకు జిల్లా సరిహద్దులోకి, 6 రోజులకు జీడిపల్లి రిజర్వాయర్‌కు కృష్ణాజలాలు చేరుకుంటాయని హంద్రీనీవా అధికారవర్గాలు వెల్లడించాయి.

**ఆలస్యంగా.. అరకొరగా**

వాస్తవానికి హంద్రీనీవాకు చాలా రోజుల క్రితమే నీటిని విడుదల చేయాల్సి ఉంది. కానీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కృష్ణా జలాలు రావడానికి తీవ్ర ఆలస్యమైంది. శ్రీశైలం జలాశయం నీటి మట్టం 830 అడుగులకు చేరుకోగానే హంద్రీనీవా ద్వారా నీటిని ఎత్తిపోయడానికి ఆస్కారం ఉంటుంది. 10 రోజుల క్రితమే ఆ మేర నీరు చేరాయి. శ్రీశైలం జలాశయం నాలుగు రోజుల క్రితమే పూర్తిగా నిండింది. ఎగువ నుంచి భారీగా వరద వస్తుండడంతో వచ్చే నీటిని వచ్చినట్లుగా శ్రీశైలం డ్యాం నుంచి దిగువకు వదిలేస్తున్నారు. దాదాపు రెండు లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా వెళ్లిపోయాయి.

**టీడీపీ ఎమ్మెల్యే నిర్వాకంతోనే..**

టీడీపీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌కు చెందిన కన్‌స్ట్రక్షన్ కంపెనీ నిర్వాకం కారణంగా నీరు రావడం ఆలస్యమైంది. కర్నూలు జిల్లాలో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న సుధాకర్‌యాదవ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ హంద్రీనీవా కాలువను మట్టితో పూడ్చి దానిపై తాత్కాలిక రోడ్డు వేయడంతో దుస్థితి నెలకొంది. సదరు కంపెనీకి లబ్ధి చేకూర్చేందుకు అధికారులు కూడా నీటి విడుదలలో జాప్యం చేశారు. అయితే, నాలుగు రోజుల క్రితం సాక్షి ప్రధాన సంచికలో 'పుట్టా పాపం.. సీమకు శాపం' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో ఆగమేఘాలపై స్పందించి తాత్కాలికంగా పైపులను అమర్చి నీటి విడుదల ప్రారంభించారు. అయితే ఆ పైపులు కూడా చిన్నవిగా ఉండడంతో కేవలం 1,000 క్యూసెక్కులు నీరు మాత్రమే వస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి 3,850 క్యూసెక్కుల సామర్థ్యంతో హంద్రీనీవా కాలవను నిర్మించారు. అయితే కాలవకు లైనింగ్ లేకపోవడం, ఇతరత్రా ఇబ్బందుల కారణంగా 2,200 క్యూసెక్కుల నుంచి 2,400 క్యూసెక్కుల వరకూ నీటిని తీసుకుంటున్నారు. ఆ నీటిని తరలించడంలోనూ కూటమి ప్రభుత్వం విఫలమవుతోంది. జిల్లాకు ఎక్కువ నీటిని తీసుకురావడంపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించకపోవడంతో ఈ సారి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

## క్లుప్తంగా

### సజావుగా సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న మునిసిపల్ ఆర్డీ పీవీవీఎస్ మూర్తి

**అనంతపురం కార్పొరేషన్:** నగరపాలక సంస్థలో గురువారం వెల్ఫేర్ కార్యదర్శి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన సజావుగా సాగింది. మునిసిపల్ ఆర్డీ, నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీఎస్ మూర్తి స్వయంగా అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. గతంలో బీకాం అర్హతతో వెల్ఫేర్ కార్యదర్శులుగా నియమితులైన వారు ఆ పోస్టు మంజూరుకు కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీంతో బీకాం విద్యార్హత ఆధారంగా వెల్ఫేర్ కార్యదర్శి పోస్టును మంజూరు చేయవచ్చునని న్యాయస్థానం తీర్పు వెలవరించింది. దీంతో 12 మంది అభ్యర్థులకు గానూ తొలి రోజు సర్టిఫికెట్ల పరిశీలనకు 9 మంది హాజరయ్యారు. అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, ఆర్ఓ సతీష్ పాల్గొన్నారు.

### కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి



మృతి చెందిన గొర్రె పిల్లలు

**బెళుగుప్ప:** మండలంలోని కోనాపురం గ్రామంలో వీధి కుక్కల దాడిలో 30 గొర్రె పిల్లలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన కురుబ శ్రీరాములు తన మందను గురువారం ఉదయం మేపునకు తీసుకెళుతూ గొర్రె పిల్లలను దొడ్డిలోనే ఉంచాడు. తిరిగి వచ్చేలోపు వీధి కుక్కలు చొరబడి 30 గొర్రె పిల్లలను హతమార్చాయి. దీంతో రూ.75 వేల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత కాపరి వాపోయాడు.

### ఎస్టీయూ నేత సూర్యనారాయణగౌడ్ మృతి



**అనంతపురం ఎడ్యుకేషన్:** రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) సీనియర్ నాయకుడు, రాప్తాడు జెడ్పీహెచ్ఎస్‌లో ఇంగ్లిష్ టీచరుగా పనిచేస్తున్న అక్కిలి సూర్యనారాయణ గౌడ్ (59) మృతి చెందారు. ఆయనకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఆయన బెంగళూరులో చికిత్స తీసుకునేవారు. ఇటీవల ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్సకు స్పందించక గురువారం ఉదయం కన్నుమూశారు. పెద్దవడుగూరు మండలం చిట్టూరు గ్రామానికి చెందిన సూర్యనారాయణగౌడ్ 1996 డీఎస్సీలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరారు. ఆ తర్వాత స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. వామపక్ష భావజాలం ఎక్కువగా ఉన్న ఆయన విద్యార్థి దశలోనే ఏఐఎస్ఎఫ్‌లో కీలకంగా పని చేశారు. టీచరుగా ఉద్యోగం వచ్చిన తర్వాత సీపీఐ అనుబంధ రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ)లోనూ కీలక బాధ్యతలు నిర్వర్తించారు.

# ‘అనంత’ రంగస్థల దిగ్గజం ‘రాఘవ’

**సందర్భం** నేడు బళ్లారి రాఘవ 144వ జయంతి

- జిల్లా, రాష్ట్ర స్థాయి పురస్కారాలు అందుకోనున్న జిల్లా కళాకారులు



బళ్లారి రాఘవ

**అనంతపురం కల్చరల్:** బళ్లారి రాఘవ... ఈ పేరు వింటే ప్రపంచ స్థాయి రంగస్థల నటులైనా ముగ్ధులైతీరుతారు. భారత ప్రభుత్వం సైతం ఆయన జ్ఞాపకార్థం ఓ పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేసి గౌరవించింది. ‘మీరు మా దగ్గరికి రావడమెందుకు..మేమే మీ దగ్గరకు రావాలి., ఇంగ్లాండులో మీరు పుట్టుంటే షేక్స్‌పియర్ కంటే గొప్పవారయ్యే వారు’ అని ప్రఖ్యాత కవి జార్జ్ బెర్నార్డ్‌షా... ఓ తెలుగు వాడిని... అందునా అనంత వాసిని ప్రశంసించారంటే అది ఎంత గొప్ప విషయమో మాటల్లో చెప్పేది కాదు. సహజ నటనకు కొత్త ఒరవడిదిద్ది ఏ తరం వారికైనా ప్రాతఃస్మరణీయుడిగా తనదైన ముద్ర వేసుకున్న బళ్లారి రాఘవాచార్యులు జయంతి సందర్భంగా శుక్రవారం సాయంత్రం అనంతపురంలోని లలిత కళాపరిషత్తులో ప్రత్యేక సాంస్కృతిక సంబరాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నాటకరంగ అభివృద్ధికి కృషి చేస్తున్న నటులకు, రచయితలకు పురస్కారాలనందించనున్నట్లు ఎల్కేపీ కార్యదర్శి పద్మజ తెలిపారు. పురస్కారాలను అందుకునే ప్రముఖులు గురించి ‘సాక్షి’ ప్రత్యేక కథనం.

**అభినవ మాయల మరాఠి**



మాయల మరాఠి పాత్ర పేరెత్తగానే గుర్తొచ్చే పేరుగా దయానంద ముందు వరుసలో ఉన్నారు. అనంత రంగస్థలానికి విశేష సేవలందించిన ఆయన ఈసారి జిల్లా స్థాయి రాఘవ అవార్డుకు ఎంపికయ్యారు. కళనే వృత్తిగా స్వీకరించిన ఆయన అనేక ప్రాంతాల్లో వందలాది నాటకాల్లో భీముడిగా, షిరిడి సాయిబాబాగా, విశ్వామిత్రుడిగా, హరిశ్చంద్రుడిగా విశేషంగా రాణించారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం పేరూరుకు చెందిన ఆయన 1978 నుంచి పలు అవార్డులు, రివార్డులు అందుకుని అనంత ఖ్యాతిని పెంచారు.

**కళామతల్లి సేవలోనే**



జీవించడానికి అనేక చిన్నాచితక పనులను సమర్థవంతంగా చేసుకుంటూనే ప్రవృత్తి రీత్యా మంచి నటుడైన సంజీవరెడ్డిని ఈ సారి జిల్లా స్థాయి బళ్లారి రాఘవ పురస్కారాన్ని ఎంపిక చేశారు. కర్ణుడి పాత్రకు ఎనలేని పేరు తెచ్చిపెట్టిన సంజీవరెడ్డి... పెద్దపప్పూరు మండలం చిక్కేపల్లి గ్రామానికి చెందిన వారు. రాముడిగా, కృష్ణుడిగా, అర్జునుడిగా.. ఏ పాత్ర వేసినా అతికినట్టుండే ఆయన మృదుస్వభావిగా అందరి మన్ననలూ అందుకున్నారు. ప్రస్తుతం కళామతల్లి సేవలోనే తరిస్తూ లలిత కళాపరిషత్తులో సాగే ప్రతి కార్యక్రమానికీ అండగా నిలుస్తున్నారు.

**నంది నాటకమంటే గుర్తొచ్చే పేరు**



వైఎస్సార్ జిల్లాకు చెందిన పల్లేటి కులశేఖర్ పేరు చెప్పగానే ఎవరికైనా అవార్డులందుకునే నంది నాటకాలు గుర్తొస్తాయి. 1982 నుంచి ఇప్పటి వరకూ మొత్తం 62 నాటకాలు రాసిన ఆయన ఎంతో మంది దిగ్గజ నటుల ప్రశంసలందుకున్నారు. ఏడు పదుల వయసులోనూ రంగస్థలమంటే అభిమానించే ఆయన వ్యక్తిగతంగాను 94 నంది అవార్డులందుకున్నారు. ప్రస్తుతం ఆయన రాసిన ‘శకుని’ నాటకాన్ని అనంత కళాకారులు నంది నాటక పోటీల కోసం సిద్ధం చేస్తున్నారు. ఆయన కృషికి రాష్ట్ర స్థాయి బళ్లారి రాఘవ అవార్డుతో ఎల్కేపీ సత్కరించనుంది.

## బలవంతపు రాజీనామాలు ఆపండి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి



ఎంఈఓ సిద్ధం చేసి పాఠశాలలకు పంపిన రాజీనామా పత్రాలను చూపుతున్న సీఐటీయూ నాయకులు

**అనంతపురం అర్బన్:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు, బలవంతపు రాజీనామాలు పెచ్చుమీరాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 670 పాఠశాలల్లో దాదాపు 1,300 మంది మధ్యాహ్న భోజన కార్మికులను రోడ్డుపాలు చేశారని మండిపడ్డారు. గురువారం స్థానిక ఆ శాఖ కార్యాలయంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల రాజీనామాకు సంబంధించి బొమ్మనహాళ్ మండల విద్యాధికారి సిద్ధం చేసి ముద్రించిన రాజీనామా పత్రాలను ఆమె ప్రదర్శించి, మాట్లాడారు. జిల్లాలో అధికారులు సైతం టీడీపీ నాయకులు చెప్పినట్లుగా నడుచుకుంటూ ఏకంగా రాజీనామా పత్రాలను ముద్రించి ఇవ్వడం సిగ్గుచేటన్నారు. తప్పుడు విధానాలను అనుసరిస్తున్న బొమ్మనహాళ్ మండలానికి చెందిన ఇద్దరు ఎంఈఓలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి చర్యలు మానుకోకపోతే ప్రత్యక్ష ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షుడు రాజమోహన్, నగర కార్యదర్శి వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### రైలు ఢీకొని వ్యక్తి మృతి

**తాడిపత్రి రూరల్:** ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. జీఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపిన మేరకు... వైఎస్సార్ జిల్లా దత్తాపురానికి చెందిన రంగారెడ్డి (46) గురువారం ఉదయం అదే గ్రామ శివారులోని రైలు పట్టాల వద్దకు బహిర్భూమికి వెళ్లాడు. అనంతరం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

### రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



**సోమందేపల్లి/హిందూపురం అర్బన్:** మండలంలోని బ్రాహ్మణపల్లి రైల్వే గేటు సమీపంలో రైలు నుంచి జారి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ బాలాజీనాయక్ తెలిపిన మేరకు... గురువారం వేకువజామున హంపి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న వ్యక్తి (40) మలగూరు రైల్వే స్టేషన్ సమీపంలోకి చేరుకోగానే అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు బలమైన గాయాలైన ఆయనను స్థానికులు గుర్తించి 108 అంబులెన్స్ ద్వారా హిందూపురంలోని జిల్లాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం మధ్యాహ్నం ఆయన మృతి చెందారు. కాగా, మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. ఆచూకీ తెలిసిన వారు హిందూపురం రైల్వే పోలీసులను సంప్రదించాలని జీఆర్పీ ఎస్ఐ బాలాజీ నాయక్ కోరారు.

### ‘పింఛన్ల’పై మాట నిలబెట్టుకున్నాం : కేశవ్

**కూడేరు:** ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా కచ్చితంగా 1వ తేదీనే పింఛన్లు అందజేసి ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. గురువారం ఆయన కూడేరు మండలం అంతరగంగలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో కలెక్టర్ వినోద్ కుమార్, ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## పెన్నోబులేశుడి ఆదాయానికి టీడీపీ నేతల గండి



వేలం పాటలో ఘర్షణ పడుతున్న టీడీపీ నాయకులు

**ఉరవకొండ:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత టీడీపీ నేతల అరాచకాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. తాజాగా పెన్నోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆదాయంపై కన్నేసి దేవుడి ఖజానాకే భారీగా గండి కొట్టారు. వివరాలు... గురువారం ఉదయం పెన్నహోబిలం ఆలయ ఆదాయ వనరులపై దేవదాయ శాఖ అధికారులు వేలం నిర్వహించారు. పెన్నహోబిలం ఆలయ ఈఓ విజయ్‌కుమార్, గార్లదిన్నె మండలం కోటంక సుబ్రహ్మణ్యేశ్వర ఆలయ ఈఓ బాబు నేతృత్వంలో చేపట్టిన ఈ ప్రక్రియకు మొత్తం 43 మంది పోటీ పడ్డారు. తలనీలాలు పోగు చేసుకోవడం, కొప్పరి చిప్పలు సేకరించుకునే హక్కుల కోసం వేలం నిర్వహించగా రూ.27 లక్షలకే తలనీలాలు పోగు చేసుకునే హక్కును ఎంసీ మారెన్న దక్కించుకున్నాడు. గత ఏడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ వేలం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడంతో అప్పట్లో ఆలయానికి రూ.52.05 లక్షల ఆదాయం సమకూరింది. ఈ ఏడాది టీడీపీ నాయకుల వైఖరి కారణంగా ఆలయ ఖజనాకు ఏకంగా రూ.25 లక్షల గండి పడింది. అలాగే కొప్పరి చిప్పలు సేకరించుకునే హక్కును గత ఏడాది కంటే రూ.55 వేలు తక్కువకు రూ.5.70 లక్షలతో చలపతి అనే వ్యక్తి దక్కించుకున్నాడు. పాటదారులు, అధికారులు సిండికేట్ కావడం వల్లనే ఆలయ ఆదాయానికి గండి పడుతోందని భక్తులు ఆరోపించారు. నిబంధన మేరకు టెండర్ తక్కువగా కోట్ అయితే తిరిగి వేలాన్ని నిర్వహించాల్సి ఉన్నా.. అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరించడం గమనార్హం. ఒకానొక దశలో ఆదాయ వనరులపై హక్కులు దక్కించుకునేందుకు టీడీపీ నేతలు తీవ్ర వాగ్వాదానికి దిగారు. తమకు కావాలంటే తమకు కావాలని ఘర్షణ పడ్డారు. చివరకు పోలీసులు జోక్యం చేసుకుని సర్దిచెప్పాల్సి వచ్చింది.

## కొంచమైన చాలు ఖరము పాలు



నగరంలో గాడిద పాలు విక్రయిస్తున్న తెలంగాణకు చెందిన గంగారాం

**అనంతపురం కల్చరల్:** ‘గంగిగోవు పాలు గరిటెడైనను చాలు.. కడివెడైన నేమి ఖరము పాలు’ అనే పద్యం ఇప్పుడు రివర్స్ అయ్యింది. గరిటెడైనా చాలు ఖరము పాలు అని పాడుకుంటున్నారు! అవును ఆవు పాల కన్నా గాడిద పాలే ఎక్కువ ప్రియమవుతున్నాయి. కోపం వస్తే గాడిద అని తిట్టడం, ఎక్కువ పని చేయిస్తే.. గాడిద చాకిరీ అనుకోవడం.. సర్వ సాధారణం. నగర జనాలకు చాలా మందికి పెద్దగా తెలియకపోవచ్చు కానీ, కొన్ని పల్లెల్లో ఉదయాన్నే గాడిద పాలు అమ్మడం మామూలు విషయమే. ముఖ్యంగా ఆ పాలలో ఔషధ గుణాలుంటాయని, చిన్నపిల్లలకు పడితే మంచిదన్నది కొంత మంది నమ్మకం. అందుకే వాటికి డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. దీంతో తెలంగాణ ప్రాంతానికి చెందిన కొన్ని కుటుంబాలు అనంతపురం నగర వీధుల్లో సంచరిస్తూ గాడిద పాలు విక్రయిస్తున్నాయి. ఓ చిన్న పాలాడి (నవజాత శిశువుకు పాలు పట్టించే పాత్ర) పాలు రూ.100 చొప్పున అమ్ముతున్నారు. ఇందులో గాడిదకు మేత, తమ ఖర్చులు పోను రోజుకు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు మిగులుతుందని గాడిద పాల వ్యాపారి గంగారాం అంటున్నాడు.

## వాస్తవాలు కప్పిపుచ్చొద్దు కేశవ్



మాట్లాడుతున్న రాంభూపాల్



హంద్రీనీవా కాలువ పూడ్చి నిర్మించిన రోడ్డుపై వెళుతున్న ట్రాక్టర్

- హంద్రీ-నీవా కాలువకు నీరు రాకుండా అడ్డుకున్నది కాంట్రాక్టర్ కాదా?
- కర్నూలు జిల్లా గార్గేయపురం వద్ద కాలువను పూర్తిగా పూడ్చి రోడ్డు వేసింది నిజం కాదా?
- వాస్తవాలు చెప్పకుండా నీటి విడుదల ఆలస్యమైందనడం సరికాదు
- కారకుడైన కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్

**అనంతపురం అర్బన్:** వాస్తవాలు కప్పిపుచ్చి హంద్రీ-నీవాకు నీటి విడుదల ఆలస్యమైందని చెప్పడం సరికాదని మంత్రి పయ్యావుల కేశవ్‌కు సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ హితవు పలికారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో గురువారం ఆ పార్టీ కార్యదర్శి వర్గసభ్యుడు ఓ.నల్లప్పతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎగువన కర్ణాటకలో కురిసిన భారీ వర్షాల కారణంగా తుంగభద్ర డ్యామ్ గేట్లు ఎత్తివేశారన్నారు. దీంతో శ్రీశైలం ప్రాజెక్ట్‌కు భారీగా వరద చేరుకుంటోందని తెలిపారు. ఈ క్రమంలో శ్రీశైలం డ్యాం గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారన్నారు. అయితే బ్యాక్ వాటర్‌పై ఆధారపడిన అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు జిల్లాలకు హంద్రీ-నీవా ద్వారా చుక్క నీరు అందకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు కారణాలను విశ్లేషిస్తే... అనంతపురం నుంచి విజయవాడ వరకూ చేపట్టిన జాతీయ రహదారి పనుల్లో భాగంగా కర్నూలు జిల్లా గార్గేయపురం-బ్రాహ్మణకొట్కూరు మధ్య బ్రిడ్జి నిర్మాణం కొనసాగుతోందని, అక్కడ హంద్రీ-నీవా కాలువను పూడ్చి రోడ్డు నిర్మించారని తెలిపారు. దీంతో కాలువకు నీరు విడుదల కాకుండా పోయిందన్నారు. ఇలాంటి దుశ్చర్యకు పాల్పడిన కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాల్సింది పోయి... నీటి విడుదల ఆలస్యమైందంటూ మంత్రి పయ్యావుల కేశవ్ కథలు చెబుతున్నారని మండిపడ్డారు. పంటల సాగు కోసం కాలువపై మోటర్లు వేసుకుంటే రైతులపై కేసులు పెట్టి అపరాధ రుసుం వసూలు చేస్తున్నారని, అయితే ఏకంగా కాలువనే పూడ్చివేసి మూడు జిల్లాలకు నీరు అందకుండా చేసిన కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు ఎందుకు పెట్టడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికైనా రైతు సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే వాస్తవాలు అంగీకరిస్తూ కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయడంతో పాటు, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హంద్రీ-నీవా అధికారులు, కాలువను పూడ్చివేసినా పట్టించుకోని జాతీయ రహదారి అధికారులపై విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవాకు నీటి సాధనలో భాగంగా ఆందోళనకు సిద్ధం కావాలని రైతులకు పిలుపునిచ్చారు.

### పౌష్టికాహారం సక్రమంగా అందించండి



ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, సిబ్బంది

**బుక్కరాయసముద్రం:** రాష్ట్ర ప్రభుత్వం పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలకు సక్రమంగా పంపిణీ చేయాలని అంగన్‌వాడీ సిబ్బందిని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ఆదేశించారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గురువారం బీకేఎస్ పీహెచ్‌సీలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బందికి ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ నెల 7వ తేదీ వరకూ తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. ఇందులో భాగంగా తల్లీబిడ్డ సంరక్షణ, గర్భిణులు, కిశోర బాలికలు, బాలింతలకు పౌష్టికాహారం అందజేత, వాటి ఉపయోగాలు, మాతాశిశు మరణాల నియంత్రణ తదితర అంశాలపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ ఉమాశంకరమ్మ, డాక్టర్ స్వాతిలక్ష్మి, నోడల్ ఆఫీసర్ వనజాక్షి, సూపర్‌వైజర్ నాగమణి, సీహెచ్ఓ మోహన్ రావు, చెన్నమ్మ, నాగలక్ష్మి, ధనుంజయ, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### సెమిస్టర్ విధానంలో మెగా సప్లిమెంటరీ పరీక్షలు

**అనంతపురం:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో 2015-16 విద్యా సంవత్సరం నుంచి 2018-19 విద్యా సంవత్సరం వరకు సెమిస్టర్ విధానంలో ఫెయిల్ అయిన విద్యార్థులకు మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ గురువారం తెలిపారు. ఆగస్టు 30వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. అక్టోబర్‌లో పరీక్షలు ఉంటాయి. 1994 విద్యా సంవత్సరం నుంచి 2015 విద్యా సంవత్సరం వరకూ ఇయర్లీ పరీక్షల విధానంలోనే ఫెయిల్ అయిన వారికి మెగా సప్లిమెంటరీ పరీక్ష రాసే అవకాశం కల్పించిన సంగతి తెలిసిందే. ఇదే తరహాలోనే ఫెయిల్ అయిన వారికి సెమిస్టర్ విధానంలో అవకాశం కల్పించారు. కాగా, ఎస్కేయూ ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 5వ తేదీ నుంచి 16వ తేదీ వరకూ జరగనున్నాయి. ఎస్కేయూ, అనంతపురం, గుంతకల్లు, తాడిపత్రి, గుత్తి, హిందూపురంలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

### వైఎస్ జగన్‌తో ఆలూరు భేటీ



**శింగనమల:** వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో శింగనమల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేత ఆలూరు సాంబశివారెడ్డి గురువారం కలిశారు.

### ప్రమాదంలో యువకుడి మృతి



అనిల్ (ఫైల్)

**బుక్కరాయసముద్రం:** ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బీకేఎస్ మండలం భద్రంపల్లికి చెందిన అనిల్ (32) వ్యక్తిగత పనిపై గురువారం ఉదయం రెడ్డిపల్లికి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. రెడ్డిపల్లి శివారులోకి చేరుకోగానే జాతీయ రహదారిపై టైరు పంచర్ కావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### వ్యక్తి ఆత్మహత్య

**రాయదుర్గం/టౌన్:** ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని దావణగెరకు చెందిన ఈరణ్ణ (68) దాదాపు 20 ఏళ్ల క్రితం రాయదుర్గానికి వలస వచ్చి సిండికేట్ బ్యాంక్ వెనుక వీధిలో అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. ఆయనకు భార్య సుజాత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బతుకు తెరువు కోసం హోటల్ ఏర్పాటు చేసుకున్న ఆయన అందులో నష్టాలు రావడంతో మరో హోటల్‌లో పనివాడిగా చేరాడు. కొంత కాలం క్రితం ఆ పని కూడా మానేసి కర్ణాటకలోని థియేటర్లలో పనిచేస్తూ వచ్చాడు. ఈ నేపథ్యంలో కుటుంబంలో సమస్యలు తలెత్తాయి. ఆర్థిక ఇబ్బందులూ తీవ్రమయ్యాయి. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఈరణ్ణ గురువారం తెల్లవారుజామున ఇంటి ప్రధాన తలుపునకు బయటి నుంచి గడియపెట్టి వరండాలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబసభ్యుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

### నీటి తొట్టెలో పడి బాలుడి మృతి



తిరుపతినాయక్

**పామిడి:** ప్రమాదవశాత్తు నీటి తొట్టెలో పడి ఓ బాలుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... శింగనమల మండలం నాగులగుడ్డం తండాకు చెందిన వెంకటేష్ నాయక్, సోమ్లీబాయి దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరు కుటుంబంతో సహా వలస వచ్చి పామిడి - కొండూరు మార్గంలోని ఓ తోటలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం దంపతులిద్దరూ తోటలో పని చేస్తున్న సమయంలో పిల్లలు ఆటల్లో నిమగ్నమయ్యారు. పని ముగించుకున్న తర్వాత తమ నాల్గో కుమారుడు తిరుపతి నాయక్ (18 నెలలు) జాడ కనిపించలేదు. దీంతో వారు తోటంతా వెదుకుతూ నీటి తొట్టె వద్దకు చేరుకున్నారు. అప్పటికే నీటిలో తేలియాడుతున్న తిరుపతి నాయక్‌ను గమనించి హుటాహుటిన పామిడిలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పామిడి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### వివాహిత బలవన్మరణం



గిరిజమ్మ (ఫైల్)

**బెళుగుప్ప:** జీవితంపై విరక్తితో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని హావేరి జిల్లా హానగల్ పట్టణానికి చెందిన గిరిజమ్మ (35)కు 18 సంవత్సరాల క్రితం బెళుగుప్ప మండలం యలగలవంక గ్రామానికి చెందిన గంగాధర్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కొంత కాలంగా గంగాధర్ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తూ వచ్చాడు. దీంతో పలుమార్లు తాగుడు మానేయాలని భర్తను గిరిజమ్మ కోరింది. అయినా ఆయనలో మార్పు రాలేదు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె బుధవారం రాత్రి ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై మృతురాలి తండ్రి ప్రభాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు బెళుగుప్ప ఎస్ఐ శివ తెలిపారు.

### గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం



**తాడిపత్రి రూరల్:** మండలంలోని రావి వెంకటాంపల్లి సమీపంలో గురువారం గుర్తు తెలియని వృద్ధుడు (60) మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్ఐ కాటప్ప తెలిపారు. రోడ్డుపై పడ్డ వ్యక్తిని పరిశీలించగా అప్పటికే మృతి చెందాడన్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. శరీరంపై ఉన్న గాయాలను బట్టి ప్రమాదం చోటు చేసుకుని మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆచూకీ తెలిసిన తాడిపత్రి రూరల్ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కాటప్ప కోరారు.

# 'సమగ్ర శిక్ష'లో కలకలం

- కలెక్టర్‌ను బురిడీ కొట్టించడంపై తీవ్ర చర్చ
- విద్యాశాఖ అధికారుల తీరుపై ఇంటిలిజెన్స్ వర్గాల ఆరా




**అనంతపురం ఎడ్యుకేషన్:** 'అస్మదీయుల కోసం అడ్డగోలు నిర్ణయం' శీర్షికతో గురువారం 'సాక్షి'లో వెలువడిన కథనం 'సమగ్రశిక్ష'లో కలకలం రేపింది. జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయుల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. పోస్టులు ఖాళీ కాకుండానే వాటి భర్తీకి బుధవారం రాత్రి ఆఘమేఘాలపై స్వయంగా కలెక్టర్ ద్వారా నోటిఫికేషన్ ఇప్పించారు. గురువారం ఉదయం సమగ్రశిక్ష సూపరింటెండెంట్ ప్రదీప్‌కుమార్‌తో ఆ ఉద్యోగులకు రిలీవ్ ఉత్తర్వులు అందజేశారు. ఏఎంఓ, అసిస్టెంట్ సీఎంలను మాత్రం కొన్ని రోజులు రిలీవ్ చేయొద్దంటూ డీపీసీ మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

**ఆ ఉత్తర్వుల్లో ఏముందంటే..?**

సమగ్రశిక్ష సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారుల నియామకాలకు సంబంధించి మార్గదర్శకాలను ఈ ఏడాది ఏప్రిల్ 18న విద్యాశాఖ కమిషనర్ విడుదల చేశారు. తదుపరి జరగబోయే నియామకాల్లో (ఫారెన్ సర్వీస్) ఈ మార్గదర్శకాలను పాటించాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న వారిని తొలిగించబోమని అందులో లేదు. పనితీరు సరిగా లేక తప్పించాలనుకున్నా.. విద్యా సంవత్సరం ముగిసిన తర్వాతే చర్యలు తీసుకోవాలని అందులో స్పష్టంగా పేర్కొన్నారు. అయితే, ఆ ఉత్తర్వుల రాకమునుపే అప్పటి కలెక్టర్ ఉత్తర్వుల మేరకు నియామకం పొంది పని చేస్తున్న వారి అర్హతలను పరిశీలించడానికి విద్యాశాఖ అధికారులు కమిషనర్ ఉత్తర్వులను ఎంచుకున్నారు. అస్మదీయుల కోసం, ముఖ్యంగా తన సామాజిక వర్గీయులకు మేలు చేసేందుకు వారికి కొలువులు ఇప్పించేందుకు ఉన్నవారిని బయటకు పంపేందుకు పక్కావ్యూహం రచించారు. ఇందుకు ప్రతిఫలం కూడా బాగానే అందుకున్నారు. ఈ వ్యవహారం చాలా గుట్టుగా నడిపారు.

**అప్పట్లో వెనక్కు వచ్చిన ఫైలు**

ఏపీసీగా వరప్రసాద్ రావు ఉన్న సమయంలో ముఖ్యమైన అధికారి ఈ వ్యవహారానికి బీజం వేశారు. అయితే వరప్రసాద్‌రావు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తదుపరి నియామకాల వారికి ఈ నిబంధనలు వర్తిస్తాయని వివరించడంతో తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఇంతలోనే వరప్రసాద్ రిటైర్డ్ అయ్యారు. చిన్న లొసుగును ఒక సీనియర్ అసిస్టెంట్ తనకు అనుకూలంగా మలుచుకున్నాడు. రానున్న బదిలీల్లో తనకు తప్పనిసరి కావడంతో ఇప్పటికిప్పుడైతే ధర్మవరం డీవైఈఓ కార్యాలయానికి వెళ్లొచ్చని భావించాడు. ఇదే విషయమై అధికారితో మాట్లాడుకుని బాగానే సమర్పించుకున్నాడు. ఈ క్రమంలో మళ్లీ కమిషనర్ మార్గదర్శకాలు తెరపైకి వచ్చాయి. డీపీసీ ద్వారా మరోమారు కలెక్టర్‌కు ఫైలు పంపారు. ఇదే సమయంలో ఏపీసీగా వైఖోం నిదియాదేవి బాధ్యతలు తీసుకోవడంతో ఈ తతంగానికి మళ్లీ బ్రేక్ పడింది. డిప్యూటేషన్ గడువు ముగిసిన అసిస్టెంట్ ఏఎంఓ మాధవరెడ్డి, అనారోగ్యం కారణంగా రిలీవ్ చేయాలంటూ విన్నవించుకున్న జీసీడీఓ మహేశ్వరి, వ్యక్తిగత కారాణాలతో తనను రిలీవ్ చేయాలని కోరిన మరో అసిస్టెంట్ ఏఎంఓ చంద్రమోహన్‌రెడ్డిని రీప్యాట్రిషన్ చేసేందుకు వైఖోం నిదియాదేవి ఫైలును కలెక్టర్‌కు పంపారు. ఏపీసీ నిదియాదేవి బదిలీ కావడంతో విద్యాశాఖలో అధికారి మళ్లీ చక్రం తిప్పారు. కలెక్టర్‌ను బురిడీ కొట్టించి సమగ్రశిక్ష సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులను రిలీవ్ చేసేలా చేశారు. కాగా విద్యాశాఖ అధికారుల తీరుపై ఇంటిలిజెన్స్ వర్గాలు ఆరా తీసినట్లు తెలిసింది.

## తప్పులతడకగా ఫైలు..

- హడావుడిగా సంతకాలు

హడావుడిగా ఇందుకు సంబంధించిన ఫైలులో అన్నీ తప్పుల తడకగా రాసుకుని వెళ్లి కలెక్టర్ వినోద్‌కుమార్‌తో సంతకాలు చేయించారు. ప్రతిదీ క్షుణ్ణంగా ఒకటికి రెండుసార్లు చదివే కలెక్టర్‌నే బోల్తా కొట్టించారు. రీప్యాట్రిషన్ ఉత్తర్వుల్లో అన్ని తప్పులతడకగానే ఉన్నాయి. అందులో కొన్ని ఇలా..

- ఒక జీఓను కోడ్ చేస్తూ ఆ జీఓకు సంబంధించిన తేదీ వేసే విషయంలో 22-01-1983 అని ఉండాల్సి ఉండగా 22-01-1933 అని రాసి పెట్టారు.
- అలెస్కో'గా పని చేస్తున్న గోవిందరెడ్డిని 'అలెస్కో' (సెక్టోరియల్ ఆఫీసర్)గా చూపించారు. అసిస్టెంట్ అలెస్కో పోస్టుకు ఐదేళ్ల టీచింగ్ అనుభవం ఉంటే చాలు. అదే అలెస్కో పోస్టుకు 8 ఏళ్ల అనుభవం ఉండాలి. గోవిందరెడ్డికి ఐదేళ్ల సర్వీస్ ఉంది. కానీ ఫైలులో మాత్రం 8 ఏళ్ల సర్వీస్ లేకపోవడంతో 'హి ఈజ్ నాట్ ఎలిజబుల్' అంటూ రాసి కలెక్టర్‌కే మస్కా కొట్టారు. అంతేకాకుండా ఈయన సర్వీస్ 4 ఏళ్ల 9 నెలలు అంటూ తప్పుడు అంకెలు వేశారు.
- అసిస్టెంట్ ఏఎంఓ మాధవరెడ్డికి మూడేళ్ల గడువు పూర్తయింది. సహజంగానే ఆయనను రీప్యాట్రిషన్ చేయాలి. కానీ రిమార్క్స్‌లో 'హి ఈజ్ నాట్ ఎలిజబుల్' అంటూ రాయడంతో విద్యాశాఖలో నవ్వుకుంటున్నారు.
- అసిస్టెంట్ సీఎంఓగా పని చేస్తున్న గోపాలకృష్ణను సీఎంఓగా పని చేస్తున్నట్లు కనబరిచారు.
- అసిస్టెంట్ ఏఓంఓ చంద్రమోహన్‌రెడ్డి తనను రిలీవ్ చేయాలంటూ స్వయంగా లేఖ రాసుకున్నాడు. అయినా ఆయనను 'హి ఈజ్ నాట్ ఎలిజబుల్' అంటూ రిమార్క్స్‌లో పేర్కొన్నారు.

## ఏఐఎస్‌ఎఫ్ జీపుజాతా ప్రారంభం


జీపుజాతాను ప్రారంభిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

**అనంతపురం ఎడ్యుకేషన్:** విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్‌ఎఫ్ అనంతపురం జిల్లా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతా గురువారం ప్రారంభమైంది. నగరంలోని కేఎస్‌ఆర్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకుడు పి.నారాయణ స్వామి జాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా పి.నారాయణస్వామి, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన జీపుజాతాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీపుజాతా ముగిసిన తర్వాత కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. మూడు రోజులపాటు సాగే జీపుజాతాకు ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి నాయకత్వం వహించారు. కార్యక్రమంలో మాజీ యువజన నాయకుడు శ్రీరాములు, విద్యార్థి మాజీ నాయకులు రమణయ్య, యువజన నాయకులు అల్లిపిరా, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణయ్య, జిల్లా కోశాధికారి హనుమంతు, రాష్ట్ర సమితి సభ్యురాలు సాయి స్వరూప, రాధా, జ్యోతి, జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, నరసింహ యాదవ్,

## సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకం


అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

**అనంతపురం టవర్‌క్లాక్:** ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకం అని ఎంఈఎఫ్ జాతీయ అదనపు కార్యదర్శి బండారు శంకర్ అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బండారు శంకర్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధించిన ఘనత మందకృష్ణకు దక్కుతుందన్నారు. వర్గీకరణ కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరులు, దండోరా కార్యకర్తలకు ఈ విజయం అంకితం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కేబీ మధు, అమర్‌నాథ్, ఎల్లప్ప, గంగాధర్, రమేష్, కదిరప్ప, నాగభూషణం, నారాయణ స్వామి, పుల్లన్న, నాగేంద్ర, హనుమంతరావు, శ్రీనా, స్వతంత్ర కుమారి, శాంతమ్మ, పద్మావతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

**30 సంవత్సరాల పోరాటం**

ఎస్సీ వర్గీకరణ 30 సంవత్సరాల అలుపెరగని పోరాటమే అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు అన్నారు. గురువారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చిన్న పెద్దన్న, శివ, ఆంజనేయులు, మల్లేష్, ఓబులేసు, సంజీవ, ఆదిశేషు, నాగరాజు, పెద్దన్న, మధు, చెన్నంపల్లి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

**దళితుల్లో హర్షాతిరేకాలు**

**చెన్నేకొత్తపల్లి:** ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో గురువారం మండల వ్యాప్తంగా ఉన్న ఎస్సీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు,

## తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష


ప్రపంచ తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం


తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ ధనలక్ష్మి


రాప్తాడులో మాట్లాడుతున్న వైద్యాధికారి శ్రావణి

**అనంతపురం మెడికల్:** ప్రసవం జరిగిన గంటలోపు తల్లి బిడ్డకు ముర్రుపాలు తాగించేలా చర్యలు తీసుకోవాలని ప్రతి బిడ్డకు తల్లిపాలు అందించడమే సంకల్పంగా ముందుకెళ్లాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని చిన్నపిల్లల వార్డులో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. తల్లిపాలను తాగించడం ద్వారా బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఎటువంటి అంటు వ్యాధులు రావన్నారు. బిడ్డ మానసిక ఎదుగుదలకు తల్లిపాలు దోహదపడుతాయన్నారు. పాలు ఇవ్వడం ద్వారా తల్లికి మంచి జరుగుతుందన్నారు. డీఐఓ డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ.. పుట్టినప్పటి నుంచి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలే తాగించాలన్నారు. దాదాపుగా రెండేళ్ల వరకు తల్లి పాలు ఇవ్వొచ్చన్నారు. ఆరోగ్యశాఖలో పని చేసే ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు ప్రతి గర్భిణికి, ప్రసవించిన తల్లికి తల్లిపాల ప్రాముఖ్యతను ఈ రోజు నుంచి వారం రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి అవగాహన కల్పించనున్నారన్నారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్ మాట్లాడుతూ.. పాలు తాగించే ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఏడుస్తున్నప్పుడు పాలు తక్కువయ్యాయని పాలు అందించకూడదని సూచించారు. పాలు సరిగా ఇవ్వకపోతే బిడ్డ ప్రాణానికే ప్రమాదం కలుగుతుందన్నారు. అనంతరం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో పీఓడీటీ డాక్టర్ సుజాత, ఐడీసీఎస్ పీడీ శ్రీదేవి, ప్రొఫెసర్లు డాక్టర్ నవీన్, డాక్టర్ షంషాద్‌బేగం, డాక్టర్ రవికుమార్, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ప్రవీణ్‌దీన్‌కుమార్, డాక్టర్ సంజీవప్ప, డాక్టర్ శంకర్‌నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూరు:** తల్లిపాలు బిడ్డకు శ్రీరామ రక్ష అని ఐసీడీఎస్ సీడీపీఓ ధనలక్ష్మి, సూపర్‌వైజర్ శ్రీవాణి తెలిపారు. గురువారం మండలంలోని బి.యాలేరు అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ముర్రుపాలలో పోషకాలు పుష్కలంగా ఉంటాయని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలతో కలసి పోస్టర్లను విడుదల చేశారు.

**రాప్తాడు:** ముర్రుపాలే బిడ్డకు శ్రీరామ రక్ష అని వైద్యాధికారిణి శ్రావణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత పేర్కొన్నారు. గురువారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఐసీడీఎస్, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బిడ్డకు సక్రమంగా తల్లిపాలు అందించినప్పుడే ఆరోగ్యంగా పెరుగుతారన్నారు. తల్లిపాలు ఇవ్వని పిల్లలు అనారోగ్యానికి గురవుతారన్నారు. ప్రతి ఒక్కరూ బిడ్డ పుట్టిన అరగంట నుంచే బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. పౌష్టికాహారం, ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం, తల్లిపాల విశిష్టత, టీకాలు, 108, పిల్లల సంరక్షణ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాకే తిరుపాలు, సీహెచ్ఓ శివ ప్రసాద్, సూపర్‌వైజర్ అరుణమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్ బాబు, ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మీ, ఏంపీహెచ్ఏ డేవిడ్, ఏఎన్ఎం లీలావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, భారతి, ముత్యాలమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

## వ్యక్తికి గాయాలు

**తాడిపత్రి రూరల్:** మండలంలోని బోడాయిపల్లిలో గురువారం తెల్లవారుజామున కొందరు దాడి చేయగా బాలమద్రి (40)కి తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా వేటకొడవలితో దాడి చేశారన్నారు. తీవ్రంగా గాయపడ్డ అతడిని తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి అటునుంచి అనంతపురానికి తరలించామన్నారు. బాలమద్రి ఇచ్చిన ఫిర్యాదులోని వారికి విచారణలో ఎలాంటి సంబంధం లేదని తేలిందన్నారు. విచారణలో దాడికి బంధువుల ఆస్తి గొడవలు, కుళాయి నీటి విషయంలో జరిగిన వాగ్వివాదం కారణమై ఉండవచ్చని తేలిందన్నారు. బాధితుడి ఫిర్యాదులోని వారితోపాటు విచారణలో గుర్తించిన వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. నిందితులను గుర్తించి, కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

## బొమ్మలను పట్టించుకోరే..





నగరంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వెళ్లే మార్గంలో ఉన్న ఈ బొమ్మలు గత కొన్ని నెలలుగా శిథిలావస్థకు చేరుకున్నాయి. సూర్య నమస్కారాలు ఇలా చేస్తారని చూపించే బొమ్మలకు రంగులు లేకపోవడంతో కళావిహీనంగా కనపడుతున్నాయి. కొన్ని బొమ్మల చేతులు విరిగిపోయాయి. అటువైపుగా జిల్లా కలెక్టర్, తదితర అధికారులు రోజూ వెళ్తుంటారు. నగరపాలక సంస్థ అధికారులు బొమ్మలను రిపేరీ చేయించి, సుందరంగా ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. – సాక్షిఫొటోగ్రాఫర్, అనంతపురం:

## క్లుప్తంగా

### వైఎస్ జగన్‌ను కలసిన మీసాల రంగన్న


మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో రజక కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ మీసాల రంగన్న

**అనంతపురం కార్పొరేషన్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రజక కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ మీసాల రంగన్న గురువారం తాడేపల్లిలోకి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

### నీటిని వేడి చేసుకుని తాగాలి

**అనంతపురం కార్పొరేషన్:** నగరపాలక సంస్థ సరఫరా చేసే తాగునీటిని వేడి చేసుకుని తాగాలని సూపరింటెండెంట్ ఇంజినీర్ రామమోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం నగరపాలక సంస్థ ఓ ప్రకటన విడుదల చేసింది. నగర ప్రజలకు సరఫరా చేసే పీఏబీఆర్ డ్యాం తాగునీరు వర్షాకాలం అయినందున తుంగభద్ర డ్యాం నుంచి కెనాల్ ద్వారా పీఏబీఆర్‌కు రంగు కల్గిన నీరు చేరుతోందన్నారు. తాగునీటిని శుద్ధి చేస్తున్నా.. వర్షాకాలం కావడంతో నీరు కొద్దిగా రంగు మారినట్లు కనిపిస్తుందన్నారు. రెండు, మూడ్రోజుల పాటు నీటిని కాచుకుని తాగాలని సూచించారు.

### పరామర్శ


గంగాధర్‌తో మాట్లాడుతున్న తోపుదుర్తి నయనతారెడ్డి

**ఆత్మకూరు:** మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఈడిగ గంగాధర్ అనారోగ్యానికి గురికావడంతో కొద్ది రోజులుగా జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు తోపుదుర్తి నయనతారెడ్డి ఆసుపత్రికి వెళ్లి గంగాధర్‌ను పరామర్శించారు. ఆరోగ్యం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. వీరి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు మురళి, దామోదర్ రెడ్డి, ఓబీ టైలర్ వెంకటేష్ ఉన్నారు.

### సూర్యనారాయణ గౌడ్ మృతి బాధాకరం


ఉపాధ్యాయుడి మృతికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

**రాప్తాడు:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయుడు సూర్యనారాయణ గౌడ్ (58) గత 25 రోజులుగా బెంగళూరులో చికిత్స పొందుతూ గురువారం ఉదయం 7 గంటలకు మృతి చెందాడు. హెచ్ఎం సాంబశివ, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలలో శ్రద్ధాంజలి ఘటించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. ఆంగ్ల ఉపాధ్యాయుడు సూర్యనారాయణ గౌడ్ మృతి చెందడం బాధాకరమన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ సంఘాల నాయకుడిగా విశేష సేవలందించారని కొనియాడారు.

### తిలక్ భావకవిత్వం స్ఫూర్తిదాయకం


సాహితీ వారధులను సత్కరిస్తున్న కవులు, రచయితలు

**అనంతపురం కల్చరల్:** భావకవిత్వానికి నిర్వచనంగా నిలిచిన ప్రముఖ అభ్యుదయ కవి దేవరకొండ బాలగంగాధర తిలక్ జయంతిని అనంత రచయితలు, కవులు ఘనంగా నిర్వహించారు. గురువారం సాయంత్రం స్థానిక విశాలాంధ్ర బుక్ హౌస్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో తెలుగు వెలుగు సంస్థ అధ్యక్షుడు తాడిపత్రి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నా అక్షరాలు ప్రజాశక్తుల వహించే విజయ ఐరావతాలు అన్ని పలికిన తిలక్ భావకత, సరికొత్త చైతన్యపూరిత కవితాశక్తి ఆదర్శనీయమన్నారు. అదేవిధంగా సీనియర్ కవులు నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న, రియాజుద్దీన్, ఆకుల రఘురామయ్య, అశ్వర్థరెడ్డి, జాషువా సాహిత్యపీఠం నాగలింగయ్య తదితరులు తిలక్ విలక్షణ కవిత్వాన్ని గుర్తు చేసుకున్నారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో సమానమైన పాండిత్యాన్ని ప్రదర్శించి తెలుగు సాహిత్యంలో చుక్కానిగా నిలచిన తిలక్ కవిగానే కాకుండా కథకుడు, నాటక కర్తగా సుప్రసిద్ధులన్నారు. అనంతరం పాఠకులు, రచయితలకు వారధిగా నిలిచి దశాబ్దాల పాటూ అనంత సాహిత్య ప్రచారానికి ఎనలేని కృషి చేసిన చెట్లు ఈరన్న, శ్రీనివాసులును సత్కరించారు. అల్తాఫ్, విశ్రాంత పండితుడు శ్రీనివాసులు, యువకవులు ప్రవీణ్, హరీష్ పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో జలధి


లెనిన్ నగర్‌లో హజరత్ ఖాదర్ జిలానీ పీర్ల ఊరేగింపు

**అనంతపురం కల్చరల్:** నగర శివారులోని లెనిన్ నగర్‌లో గురువారం రాత్రి మొహరం ఉత్సవాలు ముగిశాయి. హజరత్ అబ్దుల్ ఖాదర్ జిలానీ, హసేన్ హుసేన్ , షేక్షావలి, అంగార్‌వలీ పీర్లను పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించి నగర వీధుల్లో ఊరేగించారు. ఎన్టీఆర్ నగర్, వెంగమనాయుడు కాలనీల్లో సంప్రదాయ డప్పు, మేళతాళాల హోరు నడుమ భక్తులు హారతులు పట్టి చెక్కెర చదివింపులు చేయించారు. భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. యువకులు ఉత్సాహంగా అలావ్ తొక్కారు. అనంతరం పీర్లను జలధికి తరలించారు.

### పింఛన్ల పంపిణీ పరిశీలన


మాట్లాడుతున్న మునిసిపల్ ఆర్డీ, ఇన్‌చార్జ్ కమిషనర్ పీవీవీఎస్ మూర్తి

**అనంతపురం కార్పొరేషన్:** నగరంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న పింఛన్ల పంపిణీని మునిసిపల్ ఆర్డీ పీవీవీఎస్ మూర్తి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పింఛన్ పంపిణీ ఆఫీసర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సకాలంలో పింఛన్ పంపిణీ చేయాలన్నారు. లబ్ధిదారులను తిప్పించుకోకుండా పింఛన్ సొమ్ము అందజేయాలని ఆదేశించారు. ఏమైనా సాంకేతికపరమైన సమస్యలు వస్తే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

**ఆత్మకూరు:** మండల వ్యాప్తంగా గురువారం పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. ఇంటి వద్ద అందుబాటులో లేని వారికి శుక్రవారం కూడా పింఛన్ సొమ్ము అందజేస్తామని ఎంపీడీఓ దశరథరామయ్య ఓ ప్రకటనలో తెలిపారు.

**అనంతపురం కార్పొరేషన్:** నగరంలో పింఛన్ పంపిణీ కార్యక్రమం గురువారం సజావుగా జరిగింది. మొత్తం 50 డివిజన్లలో 23,206 మంది పింఛన్ లబ్ధిదారులుండగా 22,628 మందికి సచివాలయ సిబ్బంది పింఛన్లు అందజేశారు. రూ.10.17 కోట్లకు గానూ రూ.9.92 (97.50 శాతం) కోట్ల సొమ్మును లబ్ధిదారులకు అందించారు. ఇక కేవలం 583 మందికి మాత్రమే పింఛన్ పంపిణీ చేయాల్సి ఉందన్నారు.

**చెన్నేకొత్తపల్లి:** మండల వ్యాప్తంగా గురువారం సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ మోహన్ కుమార్ తెలిపారు. అన్ని గ్రామాల్లో లబ్ధిదారులకు సచివాలయాల సిబ్బంది, వీఆర్ఓలు పింఛన్ సొమ్ము అందజేశారన్నారు. మండల వ్యాప్తంగా ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తలేదని వెల్లడించారు.

### ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు


కోటంకలో 'పొలం బడి' నిర్వహించిన వ్యవసాయ అధికారులు

**గార్లదిన్నె:** రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల పంటల్లో అధిక దిగుబడి సాధించవచ్చని అనంతపురం వ్యవసాయశాఖ ఏడీ రవి సూచించారు.గురువారం మండలంలోని కోటంకలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ అధికారి లక్ష్మన్నతో కలసి ఏడీ మాట్లాడుతూ రైతులు రసాయన మందులు వాడకుండా స్థానిక వనరులతో తయారు చేసే కషాయాలు పంటల్లో వాడి పురుగులు, తెగుళ్లను నివారించుకో వచ్చన్నారు. అలాగే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం వేరుశనగ పంట సాగు విధానంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఓ సోమశేఖర్,ఏఈఓ ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

### పేకాటరాయుళ్ల అరెస్టు

**శింగనమల:** మండలంలోని తరిమెల గ్రామ సమీపంలో ఉన్న పెన్నానదిలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను గురువారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. పెన్నానదిలో పేకాట ఆడుతున్న సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడులు చేశామన్నారు. నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.18,370, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాట, మట్కా ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.